మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, నాయకులు

పాలమూరు గుండెల్లో గులాబీ జెండా

మొదటిపేజీ తరువాయి...

సాధించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ మారి, కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెవడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఉమ్మడి జిల్లాలో 1,439 మంది ఓటర్లు ఉండగా మార్చి 28న జరిగిన పోలింగ్‌లో 1,437 మంది ఓటు వేశారు. ఏప్రిల్ 2న ఉప ఎన్నికల కౌంటింగ్ జరగాల్సి ఉంది. అయితే పార్లమెంట్ ఎన్నికలకు ముందు కౌంటింగ్ జరిగితే నష్టమని కాంగ్రెస్ భావించింది. కోడ్ అమల్లో ఉన్నందున కౌంటింగ్ వద్దని ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించడంతో జూన్ రెండుకు వాయిదా వేసింది. ఆదివారం మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. పోలైన 1,437 ఓట్లలో 21 ఓట్లు చెల్లనివిగా, మిగిలిన 1,416 ఓట్లలో 709 ఓట్లను కోటాగా నిర్ధారించారు. మొదటి ప్రాధాన్యం ఓట్లలోనే బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి 762 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి 653, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్‌కు ఒక్క ఓటు పోల్ అయింది. కోటా కన్నా ఎక్కువ ఓట్లు సాధించడంతో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిని విజేతగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవినాయక్ ప్రకటించారు.

పనిచేయని హస్తం ప్రలోభాలు

అధికారాన్ని అడ్డం పెట్టుకొని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ నాయకులు ప్రలోభాలకు గురిచేసినా స్థానిక ప్రజాప్రతినిధులు లొంగలేదు. తామంతా కేసీఆర్ వెంటే ఉంటామని నొక్కి చెప్పారు. అధికారం చేపట్టాక వచ్చిన తొలి ఎన్నికల్లోనే కాంగ్రెస్‌కు ప్రజాప్రతినిధులు ఝలక్ ఇచ్చారు. సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో కూడా కాంగ్రెస్ కన్నా బీఆర్ఎస్‌కే పది ఓట్లు ఎక్కువ వచ్చాయి. ఆరు నెలల్లోనే అధికార పార్టీపై ఎంత వ్యతిరేకత ఉన్నదో అర్థమవుతున్నది.

బీఆర్ఎస్‌లో నూతనోత్సాహం

బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా బులాబీ గెలుపు సంబురాలు మిన్నంటాయి. ఎమ్మెల్సీగా గెలుపొంది బయటికి రాగానే నవీన్ కుమార్‌రెడ్డిని పూలవర్షంతో ముంచెత్తారు. కౌంటింగ్ కేంద్రం నుంచి న్యూటౌన్ వరకు విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ చేసి అభినందించారు. గెలుపు ధ్రువపత్రాన్ని తీసుకున్నాక నవీన్‌రెడ్డి ఉమ్మడి జిల్లా ప్రధాన నేతలతో కలిసి హైదరాబాద్‌కు వచ్చారు. కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. తన విజయాన్ని కేసీఆర్‌కు కానుకగా అందించినట్టు నవీన్‌కుమార్‌రెడ్డి చెప్పారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల హక్కుల కోసం పోరాడుతానని, తనను ఓటు వేసి గెలిపించిన స్థానిక ప్రజాప్రతినిధులందరికీ పాదాభివందనం చేస్తున్నట్టు తెలిపారు.

సీఎంకే షాక్ ఇచ్చిన పాలమూరు జిల్లా

సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో జరిగిన శాసనమండలి ఉప ఎన్నికల్లో ఘోర పరాజయం ఆ పార్టీ శ్రేణులను షాక్‌కు గురి చేసింది. మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో ఉన్నమన్నె జీవన్‌రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పార్టీ మారారు. తొలుత ఎంపీ టికెట్ ఇస్తారని ఊహగానాలు వెలువడ్డా.. ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తారని భావించారు. చివరకు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక రావడంతో ఆ పార్టీకి అభ్యర్థి లేక జీవన్‌రెడ్డిని పోటీలో దింపారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన జీవన్‌రెడ్డి ఫార్మా కంపెనీ అధినేతల్లో ఒకరు. ధనబలం చూసి ఆయనకు టికెట్ ఇచ్చినట్టు ప్రచారం జరిగింది. కాంగ్రెస్‌లో సీనియర్లను కాదని జీవన్‌రెడ్డికే టికెట్ ఇవ్వడంపట్ల పార్టీ శ్రేణుల్లో ఆసంతృప్తి వ్యక్తమైంది. అయినా, ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డిని సీఎం రంగంలో దింపారు. ఎమ్మెల్సీగా పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో (200 తక్కువ కాకుండా మెజారిటీతో) గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కానీ స్థానిక ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌కే షాక్‌ఇచ్చారు.

అమరులకు అంకితం: నిరంజన్‌రెడ్డి

'తెలంగాణ స్వరాష్ట్ర ఆవిర్భావ సందర్భంలో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో నవీన్‌రెడ్డిని గెలిపించిన ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలియజేస్తున్నాం.. ఈ విజయాన్ని అమరవీరులకు అంకితమిస్తున్నామని' మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రకటించారు. కౌంటింగ్ హాల్ నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్‌రెడ్డితో కలిసి బయటికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. స్వరాష్ట్రం కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఘనత బీఆర్ఎస్‌దే అని గుర్తు చేశారు. తెలంగాణ ఆవిర్భావం రోజు మళ్లీ బీఆర్ఎస్‌ను విజయం వరించిందన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.ఇదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ప్రలోభాలకు పాతరేసిన ఎన్నిక

- సీఎం జిల్లాలో బీఆర్ఎస్ గెలుపు
- మారుతున్న తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో ఒక కీలక మలుపు
- తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్సే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): 'సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో బీఆర్ఎస్ సాధించిన గెలుపు.. మారుతున్న తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో కీలక మలుపు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు పేర్కొన్నారు. ఇది అధికార పార్టీ ప్రలోభాలకు నిలువునా పాతరేసిన ఎన్నిక అని, ఇది ఆరునెలల్లోనే కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను ఎత్తిచూపిన ఫలితం అని తెలిపారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్‌రెడ్డి విజయంపై ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. నాడైనా.. నేడైనా.. ఏనాడైనా.. తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్ మాత్రమే.. ఈ గడ్డకు శ్రీరామరక్ష అని మరోసారి తేల్చిచెప్పిన శుభతరుణమిది అని పేర్కొన్నారు. విజయం సాధించిన నవీన్‌కుమార్‌రెడ్డికి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ విజయం కోసం పనిచేసిన ప్రతి ఒక్క పార్టీ నాయకుడికి, ఎమ్మెల్యేలకు, మాజీ ఎమ్మెల్యేలకు, ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని ఎమ్మెల్సీ స్థానం గెలుచుకోవడం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. 'ఈ గెలుపు మా పైన బాధ్యతలు మరింత పెంచింది. ఈ విజయం మరిన్ని విజయాలకు దారితీస్తుందని విశ్వసిస్తున్నాం' అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేళ ఈ అద్భుత గెలుపు హర్షణీయమని, గులాబీ పార్టీ గెలుపు కోసం శ్రమించిన బీఆర్ఎస్ కుటుంబసభ్యులందరికీ మరోసారి గుండెల నిండా కృతజ్ఞతలు, శుభాకాంక్షలు, అభినందనలు అని కేటీఆర్ పేర్కొన్నారు.

హరీశ్‌రావు శుభాకాంక్షలు

మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికలో ఘన విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. గెలుపునకు కృషిచేసిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కొడంగల్‌లో బీఆర్ఎస్‌కే 10 ఓట్లు ఎక్కువ

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధుల ఆదరణ కాంగ్రెస్‌కు తగ్గిందని చెప్పొచ్చు. అధికార పార్టీకి 20 ఓట్లు పడగా.. బీఆర్ఎస్‌కు 30 ఓట్లు పోలైనట్టు అధికారుల ద్వారా తెలిసింది. హస్తం పార్టీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డికి కంటే గులాబీ పార్టీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి 10 ఓట్లు ఎక్కువగా వచ్చినట్టు సమాచారం.

సీఎంకు షాకిచ్చిన పాలమూరు

- 'స్థానిక ఎమ్మెల్సీ' బీఆర్ఎస్‌దే
- పనిచేయని కాంగ్రెస్ కుట్రకత్తులు
- బీఆర్ఎస్‌తోనే 'ప్రజాప్రతినిధులు'
- కేసీఆర్‌ను కలిసిన నేతలు
- నరేశ్‌రెడ్డికి కేసీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ కుట్రకత్తులను పాలమూరు ఛేదించింది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఉపఎన్నికలో బీఆర్ఎస్‌కే పట్టంగట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి సొంతగడ్డపై గులాబీ జెండా ఎగిరింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వేదికపై సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే పాలమూరు ఫలితం పరేడ్ చేసింది. ఈ ఎన్నికను రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా కాంగ్రెస్‌కు ఊహించని షాక్‌తగిలింది. సీఎంతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు సహా కాంగ్రెస్ శ్రేణులు సర్వశక్తులు ఒడ్డినా విజయం మాత్రం బీఆర్ఎస్‌నే వరించింది. సీఎం రేవంత్‌రెడ్డి దాదాపు ప్రతి ఒక్కరితో మాట్లాడి మద్దతివ్వాలని కోరడమే కాకుండా ఒక దశలో 'మీరు వేసే ఓటు జీవన్‌రెడ్డికి కాదు.. రేవంత్‌రెడ్డికి. నేనే నిలబడిన అనుకోండి. ఈ గెలుపు పాలమూరు భవితకు మలుపు' అని అభ్యర్థించినా స్థానిక ఓటర్లు మాత్రం గులాబీ వెంటే నిలిచారు.

'కసి'తీర్చుకున్న 'స్థానిక' ప్రజాప్రతినిధులు

అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఖరారు గురించి రాజకీయ పార్టీలు చర్చోపచర్చలు జరుపుతున్న సందర్భంలో బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని కాంగ్రెస్ ఆహ్వానించింది. కల్వకుర్తి నుంచి కసిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలోకి దిగి ఎమ్మెల్యేగా గెలిచారు. మరోవైపు నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు తన కొడుకును పార్లమెంట్ ఎన్నికల బరిలో దింపేందుకు బీజేపీలో చేరి, ఎంపీగా పోటీచేయటం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు నుంచి బీఆర్ఎస్ రెండు సీట్లు గెలవటం, అనంతర పరిణామాల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక బీఆర్ఎస్‌కు కత్తిమీద సాములా మారింది. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాలతో కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు కొత్తప్రభుత్వానికి ఆకర్షితులుగా ఉన్నా, ముఖ్యమంత్రి రంగంలోకి దిగినా బీఆర్ఎస్ దీటుగా ఎదుర్కొన్నది.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ సహా మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేశాయి. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను సమన్వయం చేయటం వంటి పరిణామాలతో బీఆర్ఎస్ తిరుగులేని విజయాన్ని సాధించింది. ఈ గెలుపుతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ తన 'స్థానిక' బలాన్ని నిలబెట్టుకున్నది. 'ఎవరి సీటు వారు సాధించుకోవటం గొప్పేం కాదు' అని కాంగ్రెస్‌లోని ఓ వర్గం ఈ ఫలితాన్ని తక్కువ చేసి చూస్తున్నా.. ఇక్కడి ప్రతికూల పరిస్థితిలో అభ్యర్థికి బలాన్నిచ్చి గెలిపు వ్యూహాన్ని రచించటమన్నది అసాధారణమైన అంశమని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ గెలుపుతో బీఆర్ఎస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే కాకుండా రాష్ట్రమంతటా గులాబీ శ్రేణులు సంబురాలు చేసుకుంటున్నాయి.

కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్సీ

బీఆర్ఎస్ నుంచి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఉపఎన్నికలో ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్‌రెడ్డికి పార్టీ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. గెలుపు పత్రం అందుకున్న ఆయన నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి చేరుకొని ఆశీర్వాదం తీసుకున్నారు. నవీన్‌రెడ్డిని కేసీఆర్‌తో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, అంజయ్య , మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, శాక్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నైతిక విజయం మాదే

- మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నైతిక విజయం కాంగ్రెస్‌దేనని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి సాంకేతికంగా గెలిచారంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన సచివాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థి 111 ఓట్ల మెజార్టీతో గెలిచారని చెప్పారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి 300 పైచిలుకు ఓట్లు మాత్రమే ఉన్నప్పటికీ, 652 ఓట్లు వచ్చాయని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ స్థానిక ప్రజాప్రతినిధులు కూడా కాంగ్రెస్‌కు ఓట్లు వేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడలేదని చెప్పారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇది నైతికంగా కాంగ్రెస్ విజయమని వ్యాఖ్యానించారు.

పాకిస్థాన్‌తో పోల్చడం కుసంస్కారం

- తెలంగాణపై ప్రేమ లేని వారికి రాష్ట్ర అవతరణ ఆర్తి ఏం తెలుసు?
- ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని, జై తెలంగాణ అని నినదించనోళ్లకు ఆ భావోద్వేగం ఎలా అర్థమైతది?
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై హరీశ్ ఫైర్

తెలంగాణభవన్‌లో మాజీమంత్రి హరీశ్‌రావుతో ముచ్చటిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 1న బీఆర్ఎస్ హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకలను పాకిస్థాన్ అవతరణ వేడుకలతో సీఎం రేవంత్‌రెడ్డి పోల్చడం ఆయన కుసంస్కారానికి, అవగాహన రాహిత్యానికి నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ భగేల్ కూడా రాష్ట్ర అవతరణ వేడుకలను మూడురోజులపాటు నిర్వహించారు. అంటే, పాకిస్థాన్‌లో ఒక రోజు ముందు స్వతంత్ర దినోత్సవం జరపడం అన్నట్టేనా? ఆ మూడు రోజుల సంబురాలు కూడా?' అని ఎక్స్ వేదికగా హరీశ్‌రావు నిలదీశారు. 'తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసినవారికి, తెలంగాణ గడ్డ మీద ప్రేమ ఉన్నవారికి రాష్ట్ర అవతరణ ప్రాముఖ్యత అర్థం అవుతుంది. ఉద్యమంలో ఏనాడు పాల్గొననివారికి, నోటి నుంచి ఒక్కసారి కూడా జై తెలంగాణ అని నినదించని వారికి, అమరులకు ఏనాడూ నివాళులర్పించని వారికి ఆ ఆర్తి, ఆ భావోద్వేగం ఎలా అర్థమవుతుంది?. ఒక్క రోజు ముందుగా జరపడం కాదు, ఏడాది పొడుగునా పండుగగా దశాబ్ది ఉత్సవాలను మా ప్రభుత్వం నిర్వహించే ప్రణాళిక చేసినం. 2023 జూన్ 2వ తేదీ నుంచి 21 రోజులపాటు జరిపిన ఉత్సవాల్లో ఆటపాటలు, కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, సంగీత విభావరి, సినిమా, జానపద కళాకారులతో ప్రదర్శనలు, సంగీత, నృత్యం, జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినం. జూన్ 2న జెండా ఆవిష్కరణతో దశాబ్ది ఉత్సవాలు ప్రారంభమై, జూన్ 22న అమరుల సంస్మరణతో ముగించినం. స్వతంత్ర పోరాటాన్ని చూడని నవతరం, తెలంగాణ ఉద్యమ పోరాటాన్ని చూసింది. ప్రత్యక్షంగా పాల్గొన్నది. ఆ ఆర్తి ఉన్నది కాబట్టే, 2023లో బీఆర్ఎస్ నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు విజయవంతమయ్యాయి. తాజాగా జూన్ 1న గన్‌పార్కు వద్ద నిర్వహించిన ర్యాలీలో పెద్దసంఖ్యలో పాల్గొని మరోసారి విజయవంతం చేశారు. ఇవన్నీ ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కుపెట్టిన వారికి ఎలా అర్థం అవుతాయి? అందుకే వారికి కేసీఆర్ జూన్ 1న నిర్వహించిన క్యాండిల్ లైట్ ర్యాలీ, సంబురాలు పాకిస్థాన్ అవతరణలా అనిపించాయి' అని హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు.

కొట్లాడి స్వరాష్ట్రం సాధించిన రోజు: హరీశ్

అరవై ఏండ్ల గోసకు, సుదీర్ఘ పోరాటాలకు, అమరుల త్యాగాలకు ఫలితం సాధించిన రోజు (జూన్ 2) నేడు అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సబ్బండవర్ణాల ప్రజలు ఏకమై గొంతెత్తగా, తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ సచ్చుడో అని తెగించి కొట్లడగా.. స్వరాష్ట్రం సాధించిన రోజు నేడు అని తెలిపారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ ఉద్యమ విశేషాలు, రాష్ట్రం ఏర్పాటయ్యాక సాధించిన ప్రగతిని ఎక్స్ వేదికగా ఆయన గుర్తు చేశారు. తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి, సంక్షేమంలో అనతికాలంలోనే అగ్రస్థానానికి చేర్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీదని తెలిపారు. దశాబ్దిలో శతాబ్దకాల అభివృద్ధిని చేసుకొని, అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా నిలిపింది బీఆర్ఎస్ పార్టీ అని పేర్కొన్నారు. 'తొమ్మిదేండ్ల కాలంలో వ్యవసాయాన్ని పండుగ చేసింది. విద్యుత్తు రంగాన్ని పటిష్టం చేసింది. విద్యారంగాన్ని ఆదర్శంగా నిలిపింది. వైద్యరంగాన్ని అగ్రస్థానానికి చేర్చింది. పెట్టుబడులతో ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. కరువుల బాధలు లేకుండా చేసింది. వలసలు వెళ్లినవారిని వాపస్ తెచ్చింది. పంట పొలాలను సస్యశ్యామలం చేసింది. ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి చేసి శభాష్ తెలంగాణ అని దేశం మెచ్చుకునేలా చేసింది. ఈ అభివృద్ధి, ఉద్యమ స్ఫూర్తి ఇక మీదట కూడా ఉండాలని, తెలంగాణ దేశానికి రోల్ మాడల్‌గా కొనసాగాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ దశాబ్ది ఉత్సవ శుభాకాంక్షలు. తెలంగాణ అమరవీరులకు జోహార్.. జోహార్.. జై తెలంగాణ' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై కళాకారులతో రాష్ట్రగవర్నర్ రాధాకృష్ణన్, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, జూపల్లి

ట్యాంక్‌బండ్‌పై గేయరచయిత అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణిని సన్మానిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్, సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్, మంత్రులు

3 జోన్లుగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. తొలుత గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, అక్కడి నుంచి నేరుగా పరేడ్‌గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎం మట్లాడుతూ.. ఈ మూడు జోన్లల్లో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి జరగాలి? ఏ విధమైన మౌలిక వసతులు కల్పించాలి? అనే అంశాలపై మెగా ప్రణాళికలో విస్పష్టంగా ప్రకటిస్తామని చెప్పారు.

అడిషనల్ డీజీ మహేశ్ భగవత్‌కు పోలీస్ మెడల్ అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాంస్కృతిక, ఆర్థిక పునరుజ్జీవనం దిశగా..

రాష్ట్రంలో సాంస్కృతిక, ఆర్థిక పునరుజ్జీవనం దిశగా తమ ప్రభుత్వం అడుగులేస్తున్నదని సీఎం తెలిపారు. రూ.వెయ్యి కోట్లతో మూసీనది సుందరీకరణను చేపట్టామని వెల్లడించారు. తెలంగాణను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, ప్రజాపాలన దరఖాస్తులు కంప్యూటరీకరిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.22,500 కోట్లు వెచ్చిస్తున్నామని, పేదల కోసం 4.5 లక్షల ఇండ్లను నిర్మించి ఇస్తామని, నియోజకవర్గానికి 3,500 ఇండ్లను కేటాయిస్తామని వివరించారు. ఇంటి స్థలం లేని వారికి స్థలం, స్థలం ఉన్న వారికి రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని అందిస్తామని చెప్పారు.

గాంధీజీ జాతిపిత కాలేదా?

రాష్ట్రావతరణ వేడుకలకు సోనియాగాంధీని ఆహ్వానిస్తే తప్పేమిటని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఏ హోదాలో సోనియాగాంధీని ఆహ్వానించారని కొంతమంది ప్రశ్నిస్తున్నారని, ఏ హోదా ఉన్నదని, ఏ పదవిలో ఉన్నారని మహాత్మాగాంధీని జాతిపితగా గౌరవించుకుంటున్నామని ప్రశ్నించారు. చరిత్ర ఉన్నంతవరకు సోనియాగాంధీని తల్లిగా తెలంగాణ గుర్తించి గౌరవిస్తుందని చెప్పారు. ఈ గడ్డతో సోనియా బంధం రాజకీయాలకు అతీతమని పేర్కొన్నారు. తల్లిని ఆహ్వానించేందుకు బిడ్డకు పర్మిషన్ అవసరమా? అని ప్రశ్నించారు.

తెలంగాణ ముందు సవాళ్లు

తెలంగాణ ప్రపంచానికే దిక్సూచి కావాలని, మన విజయ పతాక దేశ, విదేశాల్లో సగర్వంగా ఎగరాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రపంచ నంబర్‌వన్ బ్రాండ్‌గా హైదరాబాద్ ఎదగాలని అభిలషించారు. కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటా లెక్కతేల్చాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. తెలంగాణను ప్రపంచ గమ్యస్థానంగా మార్చాలన్న తమ తపనకు నాలుగుకోట్ల మంది ప్రజలు ఆశీస్సులు అందించాలని కోరారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, స్పీకర్ మీరాకుమార్, అనాటి ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్ చొరవతోనే రాష్ట్రం ఏర్పడిందని చెప్తూ, వారికి ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ చరిత్ర పుటలో ఈ ముగ్గురి చొరవ, త్యాగాలు నిలిచిపోతాయని కొనియాడారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, అధికారులు పాల్గొన్నారు. సీఎం ప్రసంగపాఠంలో 'మిత్రులారా' అనే పదం 20 సార్లు వాడారు. దీంతో సభికుల్లో కొంతమంది ఆశ్చర్యం వ్యక్తంచేశారు.

సోనియాగాంధీ వీడియో సందేశం

రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు శ్రద్ధాం